సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



అభివృద్ధి జాడే లేదు

2018 నుంచి కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 10లో▸



సంక్షేమమే మా మేనిఫెస్టో

బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రతిపక్షాలకు దిమ్మతిరిగే షాక్ ఇస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. 10లో▸



చేవెళ్ల 'చేతి'లో అసంతృప్తి

చేవెళ్ల కాంగ్రెస్‌లో అసంతృప్తి రాజుకుంది. టికెట్ ఆశించి భంగపడిన నేతలు భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తున్నారు. 10లో▸

న్యూస్‌రీల్

ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ఓటరు నమోదు కోసం ట్రాన్స్‌జెండర్స్ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి పద్మజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17న మహిళా శక్తి కేంద్రం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన సరూర్‌నగర్‌లో ట్రాన్స్‌జెండర్ ఓటరు నమోదు, సర్టిఫికెట్, ఐడీ కార్డు జారీ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, ఇతర అడ్రస్ ప్రూఫ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకు రావాల్సిందిగా సూచించారు. ట్రాన్స్‌జెండర్స్ సర్టిఫికెట్ కోసం నోటరీ చేయించుకొని అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ క్యాంపులో వీటిని ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శిగా కానుగుల



ఆమనగల్లు: కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శిగా ఆమనగల్లు పట్టణానికి చెందిన కానుగుల దశరథం నియమితులయ్యారు. ఈ మేరకు ఆల్ ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ లాల్‌జీ దేశాయ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలో జరిగిన కార్యక్రమంలో కానుగుల దశరథం కు ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి నియామకపు ఉత్తర్వులు అందించారు. అనంతరం దశరథంను ఘనంగా సత్కరించారు.

'వర్గీకరణ' బిల్లు ప్రవేశపెట్టాలి



పాదయాత్రలో మంద కృష్ణ మాదిగ, ఇతర నాయకులు

తలకొండపల్లి: నవంబర్‌లో జరగనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మహాజన నేత మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన మాదిగ విశ్వరూప మహాపాదయాత్ర సోమ వారం తలకొండపల్లి మండలానికి చేరింది. మండల పరిధిలోని మాదాయిపల్లి, చౌదర్‌పల్లి, మెదక్‌పల్లి, తలకొండపల్లి గ్రామాల మీదు గా సాగింది. స్థానిక నాయకులు మందకృష్ణకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి మాదిగలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కేంద్రం మాట తప్పిందని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్, ఉపాధ్యక్షుడు సతీస్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ, కార్యదర్శి కిరణ్ పూలే తదితరులు పాల్గొన్నారు.

రూ.29 లక్షలు పట్టివేత



మంచాల: తనిఖీ చేస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం: ద్విచక్ర వాహనాల్లో తరలిస్తున్న రూ.29 లక్షల నగదును ఇబ్రహీంపట్నం పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల నిబంధనల మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా స్థానిక మార్కెట్ యార్డు రోడ్డులో వేర్వేరు వ్యక్తులు ఆరు ద్విచక్ర వాహనాల్లో తరలిస్తున్న రూ.29 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డబ్బును ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు చెప్పారు.

చేవెళ్లలో పట్టుబడిన రూ.11.40 లక్షలు

చేవెళ్ల: మండలంలోని పోలీస్ చెక్‌పోస్టుల్లో సోమవారం రెండుచోట్ల రూ.11.40 లక్షల నగదు పట్టుబడింది. శంకర్‌పల్లి చౌరస్తా వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఓ కారులో రూ.2.60 లక్షలు దొరకగా, మండలంలోని అంతారం చెక్ పోస్టు వద్ద వికారాబాద్ వైపునుంచి వస్తున్న కారులో రూ.8.80లక్షల నగదును తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీటికి సంబంధించిన ఆధారాలు లేకపోవటంతో స్వాధీనం చేసుకున్నారు.

రూ.3.40 లక్షలు పట్టివేత

మంచాల: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఎస్ఐ రవి నాయక్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని చిత్తాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. చిత్తాపూర్ నుంచి ఇబ్రహీంపట్నంకు కారులో వెళ్తున్న చర్ల పటేల్ గూడకు చెందిన మహిపాల్ యాదవ్ వద్ద రూ.3.40 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో డబ్బులు సీజ్ చేసి అధికారులకు అప్పగించారు.



బీఆర్ఎస్ అభ్యర్థులకు బీ ఫామ్‌లు

బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆ పార్టీ సిట్టింగ్ అభ్యర్థులకు సోమవారం బీ ఫామ్‌లు అందజేశారు. ఎన్నికల ఖర్చు కోసం రూ.40 లక్షల చెక్కును సైతం ఇచ్చారు. బీఫామ్ అందుకున్న వారిలో మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, రాజేంద్రనగర్, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాల అభ్యర్థులు పి.సబితా రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాష్‌గౌడ్, కొప్పుల మహేశ్ రెడ్డి, మెతుకు ఆనంద్ ఉన్నారు.

– సాక్షి, రంగారెడ్డిజిల్లా

హస్తం.. అయోమయం

- కాంగ్రెస్ తొలిజాబితాలో చోటు దక్కని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం
- కంగుతిన్న ఆశావహులు
- పుట్టిముంచుతున్న గ్రూపు తగాదాలు
- సీపీఎంకు కేటాయిస్తారా అనే సందేహాలు
- పార్టీ శ్రేణుల్లో గందరగోళం





ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీ రెండురోజుల క్రితం విడుదల చేసిన తొలిజాబితాలో ఇబ్రహీంపట్నం అసెంబ్లీ అభ్యర్థి ఎవరనేది అధిష్టానం తేల్చలేదు. తమకే టికెట్ వస్తుందని భావించిన ఆశావహులు నిరాశ, నిస్పృహలకు గురయ్యారు. మరోవైపు కిందిస్థాయి కార్యకర్తల్లో అయోమయం, గందరగోళ పరిస్థితి నెలకింది. తొలి జాబితాలోనే అభ్యర్థి పేరు ప్రకటిస్తారని నాలుగైదు రోజులుగా ప్రచారం ముమ్మరంగా సాగింది. ఏమైందో తెలియదుగానీ లిస్ట్‌లో పేరు లేకపోవడంతో పార్టీ శ్రేణులు కలవర పడుతున్నాయి. కాంగ్రెస్ బరిలో ఉంటుందా లేదా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి.

తీవ్ర పోటీ ఉన్నందుకేనా..?

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు దండెం రాంరెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. ఎవరికి వారు పోటీపడతూ తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. మల్‌రెడ్డికి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, మర్రి నిరంజన్‌రెడ్డికి భువనగిరి ఎంపీ కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, దండెం రాంరెడ్డికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్కల మద్దతు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. తన పార్లమెంట్ పరిధిలోని ఒక్కస్థానమైన తాను సూచించిన అభ్యర్థికి ఇవ్వాలని కోమటిరెడ్డి పట్టుబడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఎవరికి వారు టికెట్ తమకే వస్తుందన్న ధీమాతో ఉన్నారు. తీరా తొలి జాబితాలో పేరు ప్రకటించకపోవడంతో అంతా కంగుతిన్నారు. పోటీ తీవ్రంగా ఉన్నందునే ప్రకటించలేదని భావిస్తున్నారు. మరోవైపు పొత్తులో భాగంగా కమ్యూనిస్టులకు కేటాయిస్తారనే ప్రచారం కూడా ఉంది.

సీటుపై సీపీఎం దృష్టి

పొత్తులో భాగంగా సీపీఎంకు ఈ స్థానం కేటాయిస్తారా.. కాంగ్రెస్‌లోని టికెట్ల పంచాయితీ ఆ పార్టీ తమకు అనుకూలంగా మలుచుకోనుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో కమ్యూనిస్టులకు పట్టుంది. మూడు పర్యాయాలు సీపీఎం అభ్యర్థులు ఇక్కడి నుంచి గెలుపొందారు. అప్పట్లో కాంగ్రెస్‌లో ఉన్న గ్రూప్ తగదాలను దృష్టిలో పెట్టుకొని పొత్తులో భాగంగా మిత్రపక్షంగా ఉన్న సీపీఎంకు 2004లో, టీడీపీకి 2018లో కాంగ్రెస్ పార్టీ ఈ స్థానాన్ని కేటాయించింది. అలాంటి పరిణామాలు ఇప్పుడు మళ్లీ చోటుచేసుకుంటున్నాయా అనే చర్చ సాగుతోంది.

అందుకే ఖరారు చేయలేదా?

రెండో ప్రాధాన్యత కింద సీపీఎం ఇబ్రహీంపట్నం స్థానాన్ని అడుగుతోంది. ఈ నేపథ్యంలోనే సీపీఎంకు కేటాయించే స్థానాల అంశాన్ని తెల్చలేకే ఇబ్రహీంపట్నం అభ్యర్థి పేరు ఖరారు చేయకుండా కాంగ్రెస్ అధిష్టానం ఆపినట్లు తెరపైకి వస్తోంది. తలనొప్పిగా మారిన గ్రూపు రాజకీయాల నుంచి బయటపడేందుకు ఈ స్థానాన్ని సీపీఎంకు కేటాయిస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరికి సీటు దక్కుతుందో తెలియక కాంగ్రెస్ శ్రేణులు డైలమాలో పడ్డాయి.

కొంపముంచుతున్న గ్రూపు తగాదాలు..

మొదటి నుంచీ నియోజకవర్గంలో గ్రూపు తగాదాలే కాంగ్రెస్ కొంప ముంచుతున్నాయి. ఎనిమిది సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు ఈ స్థానం నుంచి గెలుపొందారు. 1981, 1983లో కాంగ్రెస్ తరఫున ఏజీ కృష్ణ విజయం సాధించారు. అనంతరం జరిగిన అన్ని ఎన్నికల్లో పార్టీలోని అంతర్గత కలహాలతో ఓటమి చవిచూస్తోంది. గతం నుంచి పాఠాలు నేర్చుకోకపోగా ఇంకా గ్రూపు రాజకీయాలు జోరెక్కాయి. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ బరిలో ఉంటుందా లేదంటే పొత్తులో భాగంగా సీపీఎంకు కేటాయిస్తుందా వేచి చూడాల్సిందే.



అభివాదం చేస్తున్న రాజ్‌నాథ్‌సింగ్, కిషన్‌రెడ్డి, జవదేకర్ తదితరులు

కుటుంబ పాలనకు తెరదించాలి

- బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి
- తెలంగాణలో వచ్చేది బీజేపీ సర్కారే..
- బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి, కేంద్ర మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్
- మహేశ్వరం జనగర్జన సభకు భారీగా హాజరైన పార్టీ శ్రేణులు

బడంగ్‌పేట్: తెలంగాణలో కుటుంబపాలనకు తెరదించి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి, కేంద్ర మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్ పిలుపునిచ్చారు. బడంగ్‌పేటలోని సిరిపురం యాదయ్య స్మారక క్రీడా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన మహేశ్వరం జనగర్జన సభకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన హిందీలో ప్రసంగం చేస్తుంటే జాతీయ ఓబీసీ సభ్యుడు డా.కె.లక్ష్మణ్ తెలుగులో అనువదించారు. అనంతరం జవదేకర్ మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో 1,200 మందిని పొట్టన పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. తొమ్మిదేళ్లలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని అన్నారు. ప్రవళిక మరణం ప్రభుత్వ హత్య అని.. దీనికి మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. బీఆర్ఎస్ ఓడిపోవడం ఖాయమని, తెలంగాణలో తాము అధికారంలోకి రావడం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మూడో స్థానానికే పరిమితమవుతుందని జోస్యం చెప్పారు. మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ గెలుస్తుందన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు మాట్లాడుతూ.. దళితులతో పాటు అన్ని వర్గాల ప్రజలను మంత్రి సబితారెడ్డి మోసం చేశారని విమర్శించారు. నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేసేది పోయి అవినీతికి తెరలేపారని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పు బాష, పాప య్యగౌడ్, జంగయ్య యాదవ్, సుధాకరశర్మ, రాధ ధీరజ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు.

సభ సైడ్‌లైట్స్

- రాజ్‌నాథ్‌సింగ్‌ను భారీ ర్యాలీతో సభా స్థలికి తీసుకువచ్చారు.
- డప్పు వాయిద్యాలు, తలపై బోనాలు ఎత్తుకుని కోలాటాలతో స్వాగతం పలికారు.
- గంటపాటు రాజ్‌నాథ్ మాట్లాడడం విశేషం. ఆ తర్వాత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మాట్లాడారు.
- సభా ప్రాంగణం కాషాయ జెండాలతో నిండిపోయింది.
- పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

కాంగ్రెస్‌లోకి చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ?



ప్రతాప్‌రెడ్డితో భేటీ అయిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

షాద్‌నగర్: మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కలిశారు. సోమవారం సాయంత్రం శంషాబాద్‌లోని ప్రతాప్‌రెడ్డి ఇంట్లో ఫరూఖ్‌నగర్, కేశంపేట జెడ్పీటీసీలు, మాజీ జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌తో కలిసి ప్రతాప్‌రెడ్డి ఇంటికి వెళ్లి భేటీ అయ్యారు. కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆహ్వానించినట్లు తెలిసింది. దీనికి వారు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. మంళవారం కాంగ్రెస్ గూటికి చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

కర్ణాటక డిప్యూటీ సీఎంతో భేటీ



కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దండెం రాంరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ : కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను సోమవారం పీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు, పీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి బెంగళూరులోని ఆయన ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉన్నట్లు తెలిపారు. తన బయోడేటాతో పాటు పార్టీ అభ్యున్నతి కోసం చేసిన కార్యక్రమాలను ఆయనకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తున్న సమయంలో దండెం రాంరెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల్లో కీలకంగా ఉన్న డీకే శివకుమార్‌ను కలవడం చర్చనీయాంశంగా మారింది. దండెం రాంరెడ్డి వెంట మండల సేవాదళ్ చైర్మన్ కందుకూరి మల్లారెడ్డి, రాంబాబు, కాంటేకార్ రాహుల్, ఉసిగారి రాజు ఉన్నారు.

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: శాసనసభ ఎన్నికలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని రూమ్ నెం.15లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ)ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి లాంఛనంగా ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలు, ఎంసీఎంసీ పనితీరుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలన్నారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనల వంటివి సకాలంలో ఆమోదిస్తూ, మంజూరు చేయాలని సూచించారు. శాటిలైట్ చానెల్స్‌లో వచ్చే వార్తలను పూర్తిస్థాయిలో రికార్డు చే యాలని అన్నారు. వార్తా పత్రికలు, ఈ–పేపర్‌లు, టెలివిజన్ చానెల్స్, స్థానిక కేబుల్ నెట్‌వర్క్, సోషల్ మీడియా, మూవీ హౌస్‌లు, సంక్షిప్త సందేశాలు, ఇతర ఆడియో–వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాలని కలెక్టర్ వెల్లడించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి అని స్పష్టం చేశారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించ దానికి మీడియా పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, భూపాల్ రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారిణి ఎస్.పద్మశ్రీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ నర్సింహ, అడిషనల్ పీఆర్‌ఓ బి.బాలేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

డీఆర్సీ సెంటర్ పరిశీలన

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ భారతి హోళికేరి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి సంబంధించిన డీఆర్సీ సెంటర్‌ను సోమవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో పరిశీలించారు. సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామగ్రి పంపిణీ, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ వంటి వాటికి అనువుగా ఉన్న కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలించారు. జిల్లా లోని మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌ల కోసం అనువైన భవనాలు, గదులను పరిశీలించారు. లీకేజీలు ఏమైనా ఉన్నాయా అన్నది క్షుణ్ణంగా పరిశీలించాలని ఆర్ అండ్ బీ ఇంజినీర్లను కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ఎన్నికల నిర్వహణ సాఫీగా జరిగేలా అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఆర్‌ఓ, జోనల్ కమిషనర్ పంకజ, డీసీపీ సాయిశ్రీ తదితరులు ఉన్నారు.

ప్రపంచంలోనే బలమైన శక్తిగా భారత్

- ప్రజలు మోదీ సారథ్యాన్ని కోరుకుంటున్నారు
- కేంద్రమంత్రి పర్షోత్తమ్ రూపాలా

కల్వకుర్తి/ కల్వకుర్తి రూరల్: ప్రపంచంలోనే భారత్‌ను బలమైన దేశంగా తీర్చిదిద్దడంలో ప్రధాని మోదీ చేసిన కృషిని దేశ ప్రజలు గుర్తిస్తున్నారని కేంద్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా అన్నారు. దేశ ప్రజలు మోదీ సారథ్యాన్ని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో సోమవారం నిర్వహించిన పార్టీ విజయసంకల్ప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ రూ.9 లక్షల కోట్లు కేటాయిస్తే సీఎం కేసీఆర్ ఏమీ ఇవ్వడం లేదని అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.కేంద్ర పథకాలు తమవిగా చెప్పుకొంటున్నారని దుయ్యబట్టారు. కల్వకుర్తిలో ఆచారి గెలుపు కోసం ప్రతి కార్యకర్త అభ్యర్థిగా ఊహించుకొని పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆచారి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాల ని డిమాండ్ చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తన గెలుపును అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయం

కడ్తాల్: త్వరలో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించి, అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు ఆచారితో కలిసి పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కాసేపు ఆయన సమావేశమయ్యారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని, త్వరలో జరిగే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. అనంతరం కడ్తాల్ నుంచి కల్వకుర్తి వరకు చేపట్టిన బైక్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి వీరయ్య, రాష్ట్ర నాయకుడు శంకర్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు మన్యానాయక్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాలా, పక్కన ఆచారి

ప్రజల సంక్షేమమే మా మేనిఫెస్టో



అన్మాస్‌పల్లిలో తీగల కృష్ణారెడ్డితో కలిసి ప్రచారం చేస్తున్న జైపాల్‌యాదవ్

- ప్రతిపక్షాలకు షాక్ ఇచ్చిన పథకాలు
- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- సెంటిమెంట్‌గా అన్మాస్‌పల్లి నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభం

కడ్తాల్: బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ప్రతిపక్షాలకు దిమ్మతిరిగే షాక్ ఇస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం పార్టీ బీఫామ్ తీసుకున్న ఆయన తొలిసారిగా కల్వకుర్తి నియోజకవర్గానికి రావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్మాస్‌పల్లి, గానుగుమార్లతండాల్లో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, కల్వకుర్తి ఎన్నికల ఇంచార్జీ గోలీ శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, జెడ్పీటీసీ సభ్యులు విజితారెడ్డి, దశరథ్‌నాయక్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా బీఆర్‌ఎస్ ముందుకు వెలుతుందని అన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆసరా పింఛన్లు రూ.5016కి, దివ్యాంగుల పింఛన్ రూ.6016కి పెంచుతామన్నారు. రైతుబంధు సాయాన్ని ఎకరాకు రూ.16 వేలకు, పేద మహిళలకు నెలకు రూ.3వేల సాయం, కేసీఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో గరిష్ట పరిమితిని రూ.15 లక్షలకు పెంచుతామన్నారు. పేదలకు రూ.400కే సిలిండర్, రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం, తెల్లరేషన్ కలిగిన వారికి రూ.5లక్షల జీవిత బీమా తదితర పథకాలను అందిస్తామని వివరించారు. ప్రజాసంక్షేమం కోసం పాటుపడే బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఆశీర్వాదించాలని.. సీఎం కేసీఆర్‌ను మూడో సారి సీఎంను చేయాలని కోరారు. అనంతర వివిధ పార్టీలకు చెందిన పలువురు నాకకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్‌ఎంపీపీ అనంతరెడ్డి, సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, జిల్లా రైతుబంధు సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, అర్జున్‌రావు, వీరయ్య, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

మేకల దొంగలకు రిమాండ్

15 జీవాలు, ఇన్నోవా స్వాధీనం



సులేమాన్



హైమద్

ఇబ్రహీంపట్నం రూరల్: మేకల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సోమవారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపిన ప్రకారం.. బార్కాస్‌కు చెందిన మహ్మద్ బిన్ సులేమాన్ బనార్ (23), షేక్ హైమద్ (27) లతో పాటు మరో ఇద్దరు కలిసి ఇన్నోవా కారులో మేకలు ఎత్తెకెళ్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ పరిసర ప్రాంతాల్లో 15 మేకలను ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాల ఆధారంగా వారిపై నిఘావేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 15 మేకలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇద్దరు నిందితులపై గతంలో వివిధ పీఎస్‌లలో కేసులు ఉన్నాయని చెప్పారు. కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఐదేళ్లుగా అభివృద్ధి లేదు

నేటికీ అరకిలోమీటర్ దూరం పనులు పూర్తి చేయలేదు

- నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరా
- ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఆరు గ్యారెంటీలపై వంశీచంద్‌రెడ్డితో కలిసి విస్తృత ప్రచారం



మాలెపల్లిలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు: 2018 నుంచి కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ కల్వకుర్తి అసెంబ్లీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మాలెపల్లి, పోలెపల్లి గ్రామాల్లో ఆయన ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ వంశీచంద్‌రెడ్డి గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ స్కీంలపై విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో చేపట్టిన ప్రచారంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. తనకు పదవులు ముఖ్యం కాదు.. నియోజకవర్గ అభివృద్ధే ప్రధానమన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యేగా జైపాల్‌యాదవ్ గెలిచిన నాటి నుంచి నియోజకవర్గ అభివృద్ధిని మరిచిపోయారని ఆరోపించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ–82 కాలువ పనులను 2018 వరకు పూర్తిచేయగా కేవలం అరకిలోమీటరు పనులు మిగిలిపోయాయని ఐదేళ్ల గడిచినా అరకిలోమీటర్ పనులు ఎమ్మెల్యే చేపట్టలేకపోయారని విమర్శించారు. కల్వకుర్తి అభివృద్ధి కోసమే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతాయని, కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని వివరించారు. కార్యక్రమంలో ఆమనగల్లు ఎంపీపీ అనిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, పోలెపల్లి సర్పంచ్ బాల్‌రాం, ఉపసర్పంచ్ దారెడ్డి అంజన్‌రెడ్డి, పార్టీ నాయకులు కృష్ణనాయక్, సురేష్ నాయక్, వస్పుల శ్రీశైలం, అలీం, నాజర్, వస్పుల శ్రీకాంత్, విజయ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో బీఆర్‌ఎస్ కాపీ

ఆమనగల్లు: రాష్ట్రంలో అవినీతి పాలనను అంతం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీస్కీంలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ హామీలను, ఆరు గ్యారెంటీస్కీంలను సీఎం కేసీఆర్ కాపీ కొట్టి తన మేనిఫెస్టోగా ప్రకటించారని ఎద్దేవా చేశారు. 2014, 2018 ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్ని హామీలను అమలుచేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి కల్వకుర్తి కాంగ్రెస్ కంచుకోటగా నిరూపించాలని వంశీచంద్‌రెడ్డి కోరారు.

జల్సాలకు అలవాటుపడి చోరీలు



చోరీ చేసిన వాహనాలతో నిందితుడు మహేశ్

- పెయింటర్‌కు రిమాండ్
- రెండు బైక్‌లు, ఒక ఆటో స్వాధీనం

ఇబ్రహీంపట్నం: జల్సాలకు అలవాటుపడి వాహనాల చోరీలకు పాల్పడుతున్న పెయింటర్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మైబెల్లి తెలిపిన ప్రకారం.. యాచారం మండలం గునగల్ గ్రామానికి చెందిన మచ్చ మహేశ్(41) పెయింటింగ్ పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడడంతో వృత్తిలో వచ్చే ఆదాయం సరిపోవడం లేదు. దీంతో వాహనాల చోరీలకు పాల్పడుతున్నాడు. ఇటీవల ఎంబీ నగర్‌లో ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్ చోరీ అయిందని పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. పోలీసులు మంచాల రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి పారిపోయేందుకు యత్నించాడు. ఆయన్ను పట్టుకుని విచారించగా మరో బైక్, ఓ టాటా ఏస్ వాహనం చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

మెజార్టీ కోసమే మన ప్రచారం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: నియోజకవర్గ ప్రజలు ఇప్పటికే గెలుపు నిర్ణయించారని.. మనం కేవలం మెజార్టీ పెంచుకునేందుకే శ్రమించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ అందించిన సహకారం.. తాను చేసిన అభివృద్ధే గెలుపునకు సహకరిస్తామన్నారు. అంతకు ముందుకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నవంబర్ 30 వరకు పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉంటూ ప్రతీ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మంచిరెడ్డి కిషన్ రెడ్డి భారీ మెజార్టీతో గెలవబోతున్నారని అన్ని సర్వేలు చెబుతున్నాయన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు కర్నాటి రమేశ్‌గౌడ్, బిలకంటి శేఖర్‌రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి, పాశ్య భాషా, రాజేందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పండుగ వేళ ప్రయాణికులకు ఆర్టీసీ ప్రైజ్‌మనీ

రాజేంద్రనగర్: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు రూ.11 లక్షల ప్రైజ్‌మనీ అందజేస్తున్నట్లు రాజేంద్రనగర్ డిపో మేనేజర్ శ్రీనాథ్ ప్రకటించారు. ఈనెల 21, 22, 23, 28, 29, 30వ తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే 110 మంది ప్రయాణికులకు రూ.11 లక్షల ప్రైజ్‌మనీ అందజేయనున్నామన్నారు. రీజియన్ పరిధిలో ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులకు లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.9,900ల చొప్పున బహుమతులను అందిస్తామన్నారు. దీనికి ప్రయాణికులు టికెట్టు వెనుక పేరు, చిరునామా, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డ్రా బాక్స్‌లో వేయాలని సూచించారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- వ్యక్తి మృతి
- డ్రైవర్‌పై కేసు

తలకొండపల్లి: ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి ఆమనగల్లు–షాద్‌నగర్ ప్రధానరహదారిపై కొత్త ప్లాట్ల సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీను తెలిపిన ప్రకారం మండల పరిధిలోని రాంపూర్‌కు చెందిన పోలే మల్లేశ్(35) తన బైక్‌పై ఆమనగల్లు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. చుక్కాపూర్ శివారు ప్రాంతంలో షాద్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మల్లేశ్ కిందపడి తలకు తీవ్రగాయాలతో ఘటనాస్థలిలోనే ప్రాణాలు వదిలాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు సంతానం. ఆయన భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు డ్రైవర్ బాలయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్, సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.6వేల ఆర్థికసాయం అందజేశారు.

మహిళపై లైంగిక దాడి

- బస్టాండ్‌లో నిద్రిస్తుండగా ఘాతుకం
- ఇద్దరు నిందితులకు రిమాండ్

చేవెళ్ల: బస్టాండ్‌లో నిద్రిస్తున్న మహిళపై ఇద్దరు జులాయిలు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన ప్రకారం .. కేశంపేట మండలం కొత్తపేటకు చెందిన 20 ఏళ్ల మహిళ భర్తతో విడాకులు తీసుకుంది. ఆదివారం తల్లిదండ్రులతో గొడవపడి చేవెళ్లలో ఉండే అక్కవద్దకు వచ్చింది. ఆమె ఇంటి వద్ద లేకపోవడంతో ఎటు వెళ్లాలో తెలియక స్థానికంగా కళ్లు తాగి వచ్చి బస్టాండ్‌లోనే నిద్రకు ఉపక్రమించింది. ఇది గమనించిన ఇద్దరు జులాయిలు మద్యంమత్తులో ఆమెను వివస్త్రను చేసి అత్యాచారాని పాల్పడి అక్కడి నుంచి పారిపోయారు. కాసేపటికి బస్టాండ్‌కు వచ్చిన వ్యక్తులు ఆమెను గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని సీసీ పుటేజీలను పరిశీలించి అనిల్ కుమార్, రాజు అత్యాచారానికి పాల్పడినట్లు నిర్ధారించుకున్నారు. వెంటనే బాధితురాలిని చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యం అందించారు. సోమవారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితురాలిని వారి కుటుంబసభ్యులకు అప్పజెప్పామన్నారు.

పెండింగ్ బిల్లులను చెల్లించండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్



ఏపీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి హామీ కూలీలు

షాద్‌నగర్: పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఫరూఖ్‌నగర్‌లో ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీఓ అరుణకు ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం శ్రీను నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని చెప్పి డిజిటలైజేషన్ పేరుతో పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి భారీగా నిధులు తగ్గించిందని అన్నారు. ఈ చట్టంలో అనేక మార్పులు తీసుకొచ్చి పేదలకు అన్యాయం చేస్తుందని అన్నారు. కూలీలకు సకాలంలో కూలీ డబ్బులు చెల్లించడం లేదని అన్నారు. ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూలీలు పని చేస్తున్న సమయంలో మృతి చెందితే ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కూలీలందరికి బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పని దినాలను 200 రోజులకు పెంచి రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని, అర్హులైన కూలీలకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చంద్రకాంత్, శివకుమార్, మాధవి, యాదమ్మ, రమేష్, సరిత, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థి స్కాలర్‌షిప్‌కు ఎంపిక

రాజేంద్రనగర్: ఆల్ ఇండియా స్థాయిలో ఇంటర్మీడియట్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సైన్స్ రంగం వైపునకు ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఇచ్చే స్కాలర్‌షిప్‌కు ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజేంద్రనగర్ విద్యార్థి సీ.హెచ్.గణేష్ ఎంపికయ్యాడు. ఈ స్కాలర్‌షిప్‌లో భాగంగా ప్రతి ఏటా రూ.80 వేల చొప్పున 5 ఏళ్లకు రూ. 4 లక్షల స్కాలర్‌షిప్ ఇవ్వనున్నారు. ఇప్పటికే ఈ కళాశాల నుంచి 12 మంది విద్యార్థులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. షీ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన గణేష్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఎర్ర అంజయ్య, సిబ్బంది మాన్య, స్వప్న, కిరణ్‌కుమార్, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, పరశురాములు, మురళి, కరుణాకర్, శ్రీజన్య, నవీన్, స్వాతి, గోపీకృష్ణరెడ్డి, పార్థసారథి, శశిధర్, భరత్‌రాజ్, నర్సింగ్ అభినందించారు.

చేవెళ్ల 'చేతి'లో అసంతృప్తి



అనుచరులతో చర్చిస్తున్న రాచమల్ల సిద్దేశ్వర్



తన కేడర్‌తో సమావేశమైన షాబాద్ దర్శన్

ధిక్కార స్వరం వినిపిస్తున్న అసంతృప్త నేతలు

- అనుచరులతో రహస్య సమావేశాలు

మొయినాబాద్: చేవెళ్ల కాంగ్రెస్‌లో అసంతృప్తి రగులుకుంది. ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడిన నేతలు భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు రహస్య సమావేశాలు నిర్వహించారు. సోమవారం మొయినాబాద్ మండలంలో ఇద్దరు నేతలు వేర్వేరుగా తమ అనుచరులతో రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకున్నారు.

20 ఏళ్లుగా విధేయుడిగా

చేవెళ్ల ఎమ్మెల్యే టికెట్‌కోసం చివరి వరకు ప్రయత్నించిన రాచమల్ల సిద్దేశ్వర్ చిలుకూరు రెవెన్యూలో ఉన్న తన ఇంట్లో సోమవారం మధ్యాహ్నం తన అనుచరులతో రహస్యంగా సమావేశమయ్యారు. ఇరవై ఏళ్లుగా పార్టీకి విధేయుడిగా ఉంటూ సేవలందిస్తున్నా అధిష్టానం గుర్తించకపోవడంతో ఒకింత ఆగ్రహంగా ఉన్నారు. తనను కాదని ఐదేళ్ల క్రితం పార్టీకి వచ్చిన నేతకు టికెట్ కేటాయించడం సరికాదని.. ఏది ఏమైనా చేవెళ్ల బరిలో దిగాల్సిందేనని అనుచరులతో చెప్పినట్లు సమాచారం.

ఎమ్మెల్సీ ఇవ్వాలి

మొయినాబాద్‌కు చెందిన షాబాద్ దర్శన్ సోమవారం తన అనుచరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కనకమామిడి రెవెన్యూలోని ఓ ఫాంహౌస్‌లో సమావేశం నిర్వహించారు. చేవెళ్ల ఎమ్మెల్యే టికెట్‌కోసం దర్శన్ చివరి వరకు ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ అధిష్టానం షాబాద్ దర్శన్‌ను గుర్తించి ఎమ్మెల్సీ ఇవ్వాలని.. లేదా ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని సమావేశంలో పాల్గొన్న అనుచరులు, కార్యకర్తలు డిమాండ్ చేసినట్లు తెలిసింది. చేవెళ్ల టికెట్ దక్కకపోవడంతో ధిక్కార స్వరం వినిపిస్తున్న నేతలను హైకమాండ్ ఎలా బుజ్జగిస్తుందో అనే చర్చ సర్వత్రా వినిపిస్తోంది.

వసతుల లేమి.. ప్రాణాలకు హాని

వైన్స్‌తో ఇన్నాళ్లు మహిళలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడ్డారు. నిబంధనలు పాటించకపోవడంతో తాజాగా మందుబాబుల ప్రాణాలమీదకు తెస్తున్నాయి.

- మూత్ర విసర్జనకు వచ్చి నీట మునిగిన మద్యం ప్రియుడు
- రాత్రి 8గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించని వైనం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీ నుంచి వాంబే కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని బంగారు మైసమ్మ వైన్‌షాప్ కొనసాగుతోంది. అధికారికంగానే కొనసాగుతున్నప్పటికీ.. పర్మిట్ హాల్‌లో మూత్రశాలలు లేక మందుబాబులు షాప్ ఎదురుగా ఉన్న ఎర్రకుంట చెరువు గట్టున మూత్ర విసర్జనకు వెళ్తుంలారు. దీంతో సాయంత్రం శ్రీరాం కాలనీ పారిశ్రామిక వాడ నుంచి విధులు ముగించుకుని ఇళ్లకు చేరుకునే మహిళలు, పాఠశాలల నుంచి తమ చిన్నారులను ఇళ్లకు తీసుకెళ్లే మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలను పార్కు చేస్తుండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే సాధారణ వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. చెరువుకు పూర్తిగా ఇనుప జాలీ కంచె వేసినప్పటికీ.. వైన్స్ ఎదుట మాత్రం పది ఫీట్ల మేర జాలీ ఏర్పాటు చేయలేదు. దీంతో మందుబాబులు లోనికి వెళ్లి మూత్ర విసర్జన చేస్తున్నారు. ఈ విషయంలో ఎక్సైజ్ అధికారులు, పహాడీషరీఫ్ పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని శ్రీరాం కాలనీ, వాంబే కాలనీ వాసులు కోరుతున్నారు.

మూత్ర విసజర్జన చేస్తూ..

వైన్స్‌లో సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి (బిహార్ వాసిగా అనుమానిస్తున్న స్థానికులు) మోతాదుకు మించి మద్యం సేవించాడు. అనంతరం బయటికి వచ్చి మూత్ర విసర్జన చేస్తుండగా చెత్త పైనుంచి చెరువులోకి జారుతుండడాన్ని గమనించిన పాన్‌షాప్‌లో పనిచేసే యువకుడు సాయి, వాచ్‌మెన్ ఇద్దరు కష్టపడి కాస్త పైకి లాగారు. అయినప్పటికీ పట్టుతప్పి ఆ వ్యక్తి వారి కళ్ల ముందే చెరువులోకి మునిగాడు. అనంతరం సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు, ఫైరింజన్ ఘటనా స్థలానికి చేరుకుని జల్‌పల్లి కౌన్సిలర్ పల్లపు శంకర్ ద్వారా జేసీబీ రప్పించి చెత్త, గుర్రపు డెక్కలను తొలగించి గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అంధకారం ఉన్నప్పటికీ అగ్నిమాపక సిబ్బంది రిస్క్ తీసుకొని మరీ రాత్రి 8 గంటల వరకు గాలించినా ఆచూకీ లభించలేదు.



చెరువులో మునిగిన వ్యక్తి కోసం గాలిస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది